

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# నీ లాంటి మనిషినే!

ఇందిర ఆటో దిగి తను తెచ్చిన సామగ్రితో లోపలికి వచ్చింది. రెండు సార్లు కాలింగ్ బెల్ కొట్టిన తరువాత గాని తలుపు తెరుచు కోలేదు.

"ఏమిటి మేడం, ఇంకా నిద్ర లేవ లేదా ? ఇవాళ మీ పుట్టిన రోజు, మరిచి పోయారా?" అన్నది ఇందిర తను తెచ్చిన పూల దండలు, కేక్ టేబుల్ మీద పెడుతూ.

"పుట్టిన రోజు అయితే ఏమిటిట? జీవితం లో ఒక సంవత్సరం తగ్గి పోయింది. దానికి ఎందు కింత హడావుడి? " అన్నదామె.

"సరె, సరె అప్పుడే తొమ్మిది గంటలు అయింది. మీరు తొందరగా తెమలండి" అన్నది ఇందిర.

"రాత్రి రెండు గంటల దాకా చదువుతూ కూర్చున్నాను. అందుకే నిద్ర లేవటం లేట్ అయింది. " అన్నది మాణిక్యాంబ.

"లేట్ గా పడుకోవటం, లేట్ గా నిద్ర లేవటం గొప్ప వాళ్ళ లక్షణాలు..." అన్నది ఇందిర.

"నేను గొప్ప దాన్నా ? నాకేమన్నా పదవులు ఉన్నాయా ? అధికారాలున్నాయా ? ఆస్తులున్నాయా ? బిరుదులున్నాయా ? గొప్పదన్ని అనుకోవటానికి ? "

"అధికారాలు, ఆస్తులు ఉన్నవాళ్ళు శ్రీమంతులు కాగలరేమో కాని గొప్ప వాళ్ళు కాలేరు. గొప్ప వాళ్ళు కావటానికి పర్సులో డబ్బు ఉండక్కర లేదండి. గుండెల్లో దయ ఉంటే చాలు. " అన్నది ఇందిర.

మాణిక్యాంబ బాత్రుం లోకి వెళ్ళింది..

★★★★★★

ఇందిర జైలు గదిలో కూర్చుంది. సాయంత్రం నాలుగు గంటలు అయింది. జైల్లో ఉన్న ఖైదీల కొసం విజిటర్స్ వస్తున్నారు. అందుచేత కొంచెం సందడి మొదలైంది.

తనకోసం ఎవరో వచ్చారని చెబితే ఇందిర ఆశ్చర్య పోయింది. ఇందిర ప్రాణమున్న బొమ్మలాగా నడుచుకుంటూ వెళ్ళింది.

"నువ్వేనా ఇందిర అంటే ?" అని అడిగింది ఆమె.

"మీరెవరు ?"

"నా పేరు మాణిక్యాంబ. నీ కేసు గురించి పేపర్లో చదివాను. ఎందుకో నిన్ను చూడాలనిపించింది. నువ్వొక హంతకురాలివిగా అనిపించలేదు."

"కోర్టు నమ్మింది. ఏడేళ్ళు శిక్ష పడింది." అన్నది ఇందిర.

"అసలు ఏమి జరిగింది ? "

"అదీ పేపర్లో వచ్చి ఉంటుంది"

"నీ కోసం ఇవి తెచ్చాను. తీసుకో"

"బయట నుంచి తెచ్చినవి తీసుకో కూడదు."

"ఫర్వాలేదు తీసుకో"

వారం రోజుల తరువాత ఆమె మళ్ళీ వచ్చింది.

"మీరు ఎవరో నాకు తెలియదు. నాకోసం ఎందుకు వస్తున్నారో తెలియదు. " అన్నది ఇందిర.

"నీ గురించి పేపర్లో చదివాను. నిన్ను చూడాలని అనిపించింది. నిన్ను చూసాక మళ్ళీ రావాలని అనిపించింది. నీతో స్నేహం చేయాలని అనిపించింది. నువ్వు వద్దు అంటే మాత్రం మానేస్తాను. " అన్నది మాణిక్యాంబ.

"పిడుగుపడి చెట్టు కూలి పోయి విధ్వంసం జరిగాక కొన్నాళ్ళకు మళ్ళీ చిగురించినట్లు మీరు నన్ను వెతుక్కుంటూ వచ్చారు. మిమ్మల్ని రావద్దని ఎలా అంటాను ?" అన్నది ఇందిర.

కొన్నాళ్ళ తరువాత పండుగ వచ్చింది. మాణిక్యాంబ బెయిలు మీద ఇందిరను తన ఇంటికి తీసుకు వెళ్ళింది.

మాణిక్యాంబ ఇల్లు ఊరి చివర ఉన్నది. ఇంట్లో ఆమె ఒక్కతే ఉంటోంది. ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. పేపర్లూ, సామానులూ అన్నీ చిందరవందరగా ఉన్నయి.

"మీ ఇల్లు కన్నా మా జైలే నీటుగా ఉంది. " అన్నది ఇందిర.

"ఈ ఏకాంత వాసమూ ఒకరకంగా జైలు లాంటిదే. నీకు చుట్టూ మనుషులు అయినా కనిపిస్తారు. నాకు అదీ లేదు. "

"మీకు ఎవ్వరూ లేరా ?" అని అడిగింది ఇందిర.

"నువ్వు వచ్చావు గదా. ఇవాళ నాకు పండగే. " అన్నది మాణిక్యాంబ.

నిజానికి మాణిక్యాం ఒంటరిది కాదు. ఆమె అంటే ప్రాణం పెట్టే స్టూడెంట్స్ చాలా మంది ఉన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలతో ఆమెకు సంబంధం ఉంది. ఆ పనుల మీద దేశం అంతా తిరిగి వస్తుంటుంది.

ఇందిర గురించిన విషయాలు చెప్పమని అడిగింది మాణిక్యాంబ. ఇందిర చెప్పటం మొదలు పెట్టింది.

"మాకు అమ్మ నాన్న లేరు. మా అక్క, నేను ఇద్దరమే. మా అక్క నన్ను కంటికి రెప్పలా కాపాడెది. తను ఒక ప్రైవేటు కంపెనీ లో పని చేసేది. డబ్బు చాలేది కాదు. అందుచేత ఆఫీసు అయ్యాక ఒక హొటెల్ లో పని చేసేది. రాత్రి పూట లేట్ గా ఇంటికి రావటం కష్టం అని ఒక స్కూటరు కొన్నది. ఒకరోజు స్కూటరు మీద నుంచి వస్తుంటే యాక్సిడెంట్ అయింది. వారం రోజులు ఆస్పత్రి లో ఉన్నది. ఆ సమయం లో ఒక పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ తో పరిచయం అయింది. పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. అయితే నమ్మిన వాళ్ళని మోసం చెయ్యటం చాలా తేలిక. మా అక్క విషయం లోనూ అదే జరిగింది.

"తను మోసపోయానని తెలుసు కున్నాక అక్క పౌరుషంతొ రెచ్చిపోయింది. అతని మోసం గురించి పై ఆఫీసర్లకు రాస్తానని బెదిరించింది. ఇది జరిగిన రెండు రోజులకు అర్ధరాత్రి ఎవరో తలుపు తడితే అక్క తలుపు తీసింది. ఎవరో అక్కను కత్తితో పొడిచి వెళ్ళారు. ఆ హత్యా నేరం నా మీదకు నెట్టారు. అందుకో కథ అల్లారు. నేను ఎవరినో ప్రేమించి లేచి పోబోతుంటే మా అక్క అడ్డు పడిందని, నేను మా అక్కను చంపేసానని నేరం నా మీద మోపారు. కోర్టు నమ్మింది. నాకు శిక్ష పడింది. ..." అని చెప్పింది ఇందిర.

మాణిక్యాంబ నిట్టూర్చింది. "ఇలాంటిది ఏదో జరిగి ఉంటుందని ఊహించాను. అంతగా ప్రేమించే అక్కను ఎవరైనా చంపుతారా ? " అన్నది ఆమె.

★★★★ ★★★★

ఇందిర జైలు శిక్ష పూర్తి అయింది. విడుదల అయి బయటికి వచ్చింది.

"నువ్వు జైలు లో ఉండి వచ్చావన్న విషయం ఎవరికి తెలియనివ్వకు. కొత్త చోట, కొత్త మనుషులమధ్య కొత్త జీవితాన్ని ప్రారంభించు..." అని సలహా ఇచ్చింది మాణిక్యాంబ.

వెంకటేశ్వర్లును పరిచయం చేసింది. వాళ్ళ ఇద్దరికీ పెళ్ళి చేసింది. ఇప్పుడు ఇందిర వెంకటేశ్వర్లు ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

ఏటా మాణిక్యాంబ పుట్టిన రోజున ఇందిరా ఆమె ఇంటికి వెళ్తుంది. పూల దండలతో ముంచెత్తుతుంది. కేక్ లూ, స్వీట్లూ పళ్ళూ తెస్తుంది.

"ఎందుకు ఇవన్నీ ?" అంటుందామె.

" కొండంత దేవుడుకు కొండంత పత్రిని ఎలాగూ తేలేము.... ఏదో మా శక్తి కొద్దీ..."'అంటుంది ఇందిర.

"నన్ను దేవుడినీ, దేవతనూ చెయ్యకు. నేనూ నీ లాంటి మనిషినే ..." అన్నదామె.

"అందరూ నా లాంటి మనుషులే అని ప్రతివాళ్ళూ అనుకుంటే ఈ లోకమే స్వర్గతుల్యం అవుతుంది. ప్రేమించిన వాళ్ళ గొంతు కోసే మనుషుల మధ్య మనం బ్రతుకుతున్నాం. " అన్నది ఇందిర.

"గుళ్ళూ గోపురాలూ కట్టించి, విగ్రహారాలు ప్రతిష్టిస్తే పుణ్యం వస్తుందో రాదో నాకు తెలియదు కానీ క్రుంగి పోతున్న ఒక మనిషిని ఆదరించి పట్టెడు అన్నం పెడితే పుణ్యం వస్తుందని నా నమ్మకం. " అన్నది మాణిక్యాంబ.

"మేడం, నేను చాలా రోజుల నుంచి అడుగుతున్న ప్రశ్నకు సమాధానం చెప్ప లేదు. మీరు పెళ్ళి ఎందుకు చేసుకోలేదు " అని అడిగింది ఇందిర.

"నేను సముద్రం ఒడ్డున నిలబడి అలలు తగ్గితే స్నానం చేద్దామని ఎదురు చూసాను. అలలు తగ్గనూ లేదు, నేను స్నానం చెయ్యనూ లేదు. మీరే నయం ఇంట్లోనే చెంబుడు నీళ్ళతో స్నానం అయింది అనిపించుకున్నారు. అవునూ నువ్వు నీళ్ళోసుకున్నవట. నాకో పాపాయిని అందివ్వు...ఆడుకుంటాను..." అన్నది మాణిక్యాంబ.

ఇందిర సిగ్గు పడింది.

★★★★★★★★★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.